
సాక్షి అనంతపురం

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.35,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35,500 పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టం రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం

36.8°/12.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు ఎండ.. రాత్రి చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం



మంటల్లో తగలబడుతున్న చెత్త లారీ

రాయదుర్గం టౌన్: మున్సిపల్ డంపింగ్ యార్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్వచ్ఛాంధ్ర కింద మున్సిపాలిటీకి మంజూరైన రూ.20 లక్షల విలువైన చెత్త తరలించే లారీ పూర్తిగా దగ్ధమైంది. మంగళవారం పట్టణంలోని పలు వీధుల్లో సేకరించిన చెత్తను తీసుకుని కంపాక్ట్ వాహనం డంపింగ్ యార్డుకు చేరుకుంది. చెత్తను అన్‌లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా టైర్ బరస్ట్ కావడంతో మంటలు చెలరేగి డీజిల్ ట్యాంక్‌ను చుట్టుముట్టినట్లు కార్మికులు తెలిపారు. అదే సమయంలో డీజిల్ ట్యాంక్‌ను ఒక్కసారి మంటలు ఎగిసి పడి చుట్టు పక్కల ఉన్న చెత్తకు మంటలు వ్యాపించాయి. దీంతో పెద్ద ఎత్తున పొగ ఎగిసిపడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసే లోపు లారీ పూర్తిగా కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు వలీబాషా, శ్రీనివాసులు, కౌన్సిలర్లు బి.నాగవేణి, శ్రీనివాసరెడ్డి, ఫక్రుద్దీన్, మున్సిపల్ మేనేజర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ రాష్ట్ర సంచాలకుడు ఎం.ఆర్.ప్రసన్నకుమార్ తెలిపారు. అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. ఆడిటోరియాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నిరుపయోగంగా ఉన్న వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీటీ కట్టించిన డిజిటల్ లైబ్రరీని చూసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రసన్నకుమార్‌ను సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి రమ సన్మానించారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ శివశంకరప్రసాద్, లైబ్రేరియన్ ఇంతియాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

రక్త పోటు

ప్రస్తుత జీవన విధానం వల్ల చాలామంది బీపీ బారిన పడుతున్నారు. మనుషుల్లో రక్తపోటు సాధారణంగా 120/80 ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే, పరీక్షించిన ప్రతీసారి ఎక్కువే చూపిస్తుంటే హైబీపీ సమస్య ఉన్నట్లే. అలా కాకుండా 90/60 కంటే తక్కువగా ఉంటే, అదీ తరచూ అలాగే ఉంటే లోబీపీగా గుర్తించాలి. హైబీపీ వచ్చిన వారితో పోల్చుకుంటే లోబీపీ బాధితుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీపీపై అవగాహన లేక నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రక్తపోటు (బీపీ)ను నియంత్రణలో ఉంచుకోకపోతే పక్షవాతం, గుండెపోటు, చక్కెరవ్యాధి, మూత్రపిండాలు, నరాల వ్యాధులబారిన పడాల్సి వస్తుంది.



- బీపీ తెలుసుకోలేని వారు ఎందరో
- అవగాహన లేక పక్షవాతం బారిన పలువురు
- మంచానికే పరిమితమైన వారి సంఖ్య పెరుగుతోంది
- ఫ్యామిలీ ఫిజీషియన్ ఓపీ సేవల్లో బీపీ బాధితులే అధికం
- అనంతపురం జిల్లాలో పెరాలసిస్ పెన్షన్ లబ్ధిదారులు 1,388
- శ్రీసత్యసాయి జిల్లాలో పెరాలసిస్ పెన్షన్ లబ్ధిదారులు 943 మంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

◈ ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్పకు చెందిన వన్నూరుస్వామి పొలం పని ఎంతో హుషారుగా చేసేవాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా కళ్లుతిరిగి కిందపడ్డాడు. కాలు, చేయి చచ్చుబడింది. మూతి వంకర పోయింది. అనంతపురం సర్వజనాస్పత్రిలో పరీక్షలు చేయిస్తే తీవ్ర రక్తపోటుతో నరాలు చిట్లాయని డాక్టర్లు చెప్పారు.

◈ గుత్తికి చెందిన చిన్న శ్రీరాములు పరిస్థితీ ఇంతే. హమాలీ పనికి వెళ్లేవాడు. ఎప్పుడూ బీపీ చెక్ చేయించుకోలేదు. అయితే ఒకరోజు ఉదయాన్నే ఎడమ కాలు, చెయ్యి పనిచేయలేదు. తీవ్ర రక్తపోటుకు గురవడంతో అనంతపురంలోని ఒక న్యూరో సెంటర్‌కు తీసుకొచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

'నాకు ఎలాంటి జబ్బులూ లేవు.. ఆరోగ్యంగా ఉన్నాను.. ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరమే లేదు..' అన్న అతి ధీమా ఇప్పుడు చాలామందిని తీవ్ర ముప్పునకు గురిచేస్తోంది. నలభై ఏళ్లు దాటితే మధుమేహం, రక్తపోటు సాధారణ జబ్బులుగా వస్తున్నాయి. చాలామందిలో ఉన్న నిర్లక్ష్యం వారిని వైకల్యం వైపు నెడుతోంది. ప్రధానంగా రక్తపోటు చాపకింద నీరులా విస్తరించి తీవ్ర నష్టం కలిగిస్తోంది. దీనివల్ల చాలామంది పక్షవాతానికి గురై మంచాన పడుతున్నారు. గుండె, ఊపిరితిత్తులకు సైతం నష్టం వాటిల్లుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. నిర్దేశిత తేదీల్లో సచివాలయం వద్దకు ప్రభుత్వ వైద్య బృందం వచ్చి ఓపీ సేవలందిస్తోంది. ఇక్కడ ఓపీ సేవలు పొందుతున్న వారిలో ఎక్కువగా బీపీ రోగులు ఉంటున్నారు.

ఎలా నియంత్రించాలి?

రోజు వాకింగ్ చేయడం వల్ల రక్త పీడనం సాధారణ స్థితిలో ఉంటుంది. వారంలో 4 నుంచి 5 నిమిషాల పాటు గుండెపైన ప్రభావం చూపే పనులు చేయాలి. వీటి వల్ల రక్తపోటు సాధారణ స్థితిలోకి చేరటం మీరు గమనించవచ్చు. రోజూ 15 నిమిషాల పాటు వ్యాయామాలు చేయటం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఆహార నియమాలు పాటించాలి

మీ కుటుంబంలో ఎవ్వరికీ హైబీపీ లేకపోయినా ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవటం ఆరోగ్యానికి చాలా మంచిది. తీసుకునే ఆహారంలో అవసరమైతే తప్ప, ఒక చిటికెడు ఉప్పును కూడా ఎక్కువగా వేసుకోరాదు. ఎక్కువ రుచికోసం ఉప్పునకు బదులుగా నిమ్మరసం, వెల్లుల్లి, మిరియాలు వంటివి తీసుకోవాలి. వంటల తయారీలో నూనెలు, కొవ్వు పదార్థాల వాడకం తగ్గించాలి. మసాలాలు, కారం వాడకాన్ని అదుపులో పెట్టుకోవాలి. నిల్వ పచ్చళ్లు, నిల్వ ఉంచిన ఆహారాలు, బేకరీ ఐటమ్స్, అప్పడాలు, క్యాన్డ్ ఫుడ్స్ పూర్తిగా తగ్గించాలి. వేపుళ్లు, చిప్స్, కేకులు, బిస్కెట్లు, నూడుల్స్, పిజ్జా వంటి ట్రాన్స్ కొవ్వు పదార్థాలను నిషేధించాలి. శరీరానికి ఒత్తిడి, ఆందోళన కలగకుండా చూసుకోవాలి.

హైపర్ టెన్షన్ వల్ల కలిగే నష్టాలు

- అధిక రక్తపోటుతో తీవ్రమైన తలనొప్పితో నరాలు చిట్లి పక్షవాతం వస్తుంది
- బీపీ ఉంటే స్వల్ప లేదా తీవ్ర మైన గుండెపోటు రావచ్చు
- కిడ్నీలపై ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువ
- మెదడు, కళ్లపైన కూడా అధిక రక్తపోటు ప్రభావం ఉంటుంది



ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రభుత్వ విలేజ్ క్లినిక్‌లున్నాయి..104 వాహనాలు వస్తున్నాయి. వీటి వద్దకు వెళ్లి నెలకోసారి బీపీ చెక్ చేసుకోవచ్చు
- వ్యాయామం ప్రతిరోజూ 45 నిముషాలు చేస్తే బీపీ నియంత్రణలో ఉంటుంది
- శరీరంలో కొవ్వులు, నూనెలు అదుపులో ఉంచుకోవాలి
- అధిక బరువు ఉన్న వారు ఆరుమాసాలకోసారి ఈసీజీ తీయించుకోవాలి
- యోగా, ప్రాణాయామం వంటివి చేయడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది

	అనంతపురం జిల్లాలో	శ్రీసత్యసాయి జిల్లాలో
పెరాలసిస్‌తో మంచానికే పరిమితమై పెన్షన్ తీసుకునేవారు	1,388	943
ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు	91,816	92,560
రక్తపోటు అధికంగా ఉన్నవారు	17,698	14,869

గ్రామీణుల్లో అవగాహన లేదు



పట్టణాల్లో అయితే జ్వరమో, దగ్గో వచ్చినప్పుడు డాక్టర్ దగ్గరకు వస్తారు. అప్పుడు బీపీ, షుగర్ చెక్ చేస్తాం. బీపీ బయట పడితే మందులు వాడతారు. కానీ పల్లెల్లో నేరుగా మందుల షాపుకే వెళ్లి తీసుకుంటారు. టెస్టులు చేయించుకోరు. దీనివల్ల బీపీ పెరిగి పెరాలసిస్‌కు దారితీస్తుంది. తరచూ చెక్ చేయించుకుని, బీపీ ఉందని తెలిసినప్పుడు మందులు వాడుతుంటే నియంత్రణలో ఉంటుంది.

– డా.జాషువా కాలెబ్, న్యూరో ఫిజీషియన్, అనంతపురం

గ్రూపు-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

- ప్రారంభించిన ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప



శిక్షణ ఇస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: గ్రూపు-1 మెయిన్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు స్థానిక పోలీసు లైబ్రరీలో ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప నేతృత్వంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం ఉదయం శిక్షణ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే తీరును అభ్యర్థులకు వివరించారు. అనంతరం 2018 ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, మధుసూదనరావును ఆహ్వానించి, వారితో పలు అంశాలపై శిక్షణ ఇప్పించారు. పరీక్ష రాసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను అభ్యర్థులకు ఆర్డీఓలు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్‌యాదవ్, ఆర్ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు పటిష్ట కార్యాచరణ

- పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆర్‌బీకే వేదికగా పశుగణన కొనసాగించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందుకు సంబంధించి మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమావేశమై చర్చించారు. పశువులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు, ఒంటెలు... తదితర అన్ని రకాల జంతువుల సంఖ్యను లెక్కించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం పశుగణన బృందాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామన్నారు. చివరి సారిగా 2018లో జరిగిన పశుగణనలో ఉమ్మడి జిల్లా పరిధిలో 4.97 లక్షల ఆవులు, ఎద్దులు, 2.85 లక్షల గేదెలు, 49.23 లక్షల గొర్రెలు, 8.84 లక్షల మేకలు ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం చేపట్టనున్న పశుగణన ద్వారా పక్కా గణాంకాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

'నైతికత, మానవ విలువలు'పై నేడు పరీక్ష

అనంతపురం: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం 'నైతికత, మానవ విలువలు'పై పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఈ నెల 17న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటికే ఫెయిలైన విద్యార్థులు పాత హాల్‌టికెట్ నంబర్‌ను పరిగణనలోకి తీసుకుని పరీక్షకు అనుమతిస్తామని చెప్పారు. 'ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్', 'ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్' పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో 256 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. 28,324 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

ప్రతిభతోనే దశ..దిశలా ఖ్యాతి





మాట్లాడుతున్న కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, 'దశ - దిశ' సదస్సుకు హాజరైన విద్యార్థులు

- ఉజ్వల భవితకు సరైన నిర్ణయం
- ఫ్యాకల్టీ చూసి కళాశాల ఎంపిక
- అవగాహన సదస్సులో వక్తలు

అనంతపురం: నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుని జీవితంలో స్థిరపడాలంటే ఇంటర్మీడియెట్‌లో తీసుకునే నిర్ణయాలు కీలకమని, మారుతున్న కాలానుగుణంగా తీర్చిదిద్దిన కోర్సులు, ఆసక్తి, అనుకూలమైన కోర్సులను ఎంపిక చేసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని వక్తలు సూచించారు. అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 'సాక్షి' - కేఎల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సులపై 'దశ - దిశ' పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, రాయలసీమ ఇన్‌చార్జ్ టీఎల్ చెన్నకేశవగౌడ్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ దుర్గేశ్, ఆంజినేయులు, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.

మెచ్చిన కళాశాలే మేలు

విద్యార్థి నచ్చిన కోర్సు కన్నా.. మెచ్చిన కళాశాలనే ఎంపిక చేసుకోవాలి. భారతదేశంలోనే టాప్-100 వర్సిటీలను ఎంపిక చేసుకుని అందులోనూ అత్యుత్తమ వర్సిటీలో ఇంజినీరింగ్ అడ్మిషన్ పొందాలి. చాయిస్‌బేస్డ్ క్రెడిట్ సిస్టమ్, కోర్సు మార్పు, మైనర్‌డిగ్రీ, ఇంటర్న్‌షిప్, డ్యూయల్ డిగ్రీ అమలు చేస్తున్న వర్సిటీలోనే ఇంజినీరింగ్ పూర్తి చేయాలి. నైపుణ్యమే ప్రధానమైన అంశం. 18 సంవత్సరాలు కష్టపడితే..80 సంవత్సరాలు సుఖంగా ఉండవచ్చు. ప్రతిభచాటి సీటు దక్కించుకుంటే కేఎల్ వర్సిటీలో రాయితీతో చదివిస్తాం.

– డాక్టర్ జె.శ్రీనివాస రావు, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్

లక్ష్యసాధనకు తోడ్పాటు



విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో తీసుకునే నిర్ణయం భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఈ సమయంలో ప్రతి కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటూ జ్ఞానాన్ని పెంచుకోవాలి. విద్యార్థుల లక్ష్యసాధనకు కేఎల్ యూనివర్సిటీ తోడ్పాటు అందిస్తుంది.

–టీఎల్ చెన్నకేశవగౌడ్, రాయలసీమ ఇన్‌చార్జ్, కేఎల్ యూనివర్సిటీ

కొత్త కోర్సులు తెలిశాయి



'సాక్షి' - కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన అవగాహన సదస్సు ద్వారా కొత్త కోర్సుల గురించి తెలుసుకున్నాను. ఇంటర్మీడియెట్ తర్వాత ఎటువంటి కోర్సులు తీసుకోవాలి..ఎలాంటి కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నది దశ-దిశ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నాం. ఇది మా భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– మోక్షజ్ఞ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, అనంతపురం

ప్రతిభావంతులకు సరైన ఎంపిక



ప్రతిభావంతులకు కేఎల్ యూనివర్సిటీ సరైన ఎంపిక. విద్యార్థి తమకు నచ్చిన అధ్యాపకుడిని ఎంపిక చేసుకునే అధికారం ఉంది. పరిశోధన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఆసక్తి గల వారికి మొదటి సంవత్సరంలోనే ప్రాజెక్ట్ చేసేందుకు సహాయం చేస్తుంది. కేఎల్ యూనివర్సిటీలో చేరడానికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు, బ్యాంకు రాయితీలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఇంటర్మీడియెట్ తర్వాత సరైన కళాశాల, సరైన కోర్సులను కేఎల్ యూనివర్సిటీలో ఎంపిక చేసుకుని చేరవచ్చు.

–దుర్గేశ్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

కోర్సులపై అవగాహన వచ్చింది



ఈ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ ద్వారా అందుబాటులో ఉన్న కోర్సులపై అవగాహన ఏర్పడింది. ఇంటర్మీడియెట్ తరువాత ఏయే కోర్సులు చేయవచ్చనే అంశంపై స్పష్టత వచ్చింది. విద్యార్హత ఉంటే చాలదని, నైపుణ్యం ముఖ్యమని తెలిసింది. ఉత్తమ ఫ్యాకల్టీ ఉన్న కళాశాలను ఎంపిక చేసుకుంటేనే నైపుణ్యాలు మెరుగవుతాయని అర్థమైంది.

– సాహితీ, ఇంటర్మీడియెట్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల

రిమాండ్‌కు లాయర్

- రియల్ ఎస్టేట్‌లో తకరారు
- నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయం

రాప్తాడు రూరల్: నకిలీ పత్రాలు సృష్టించి విలువైన పది సెంట్ల స్థలాన్ని కాజేసే ప్రయత్నం చేసిన లాయర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను అనంతపురం రూరల్ పోలీసులు మంగళవారం వెల్లడించారు. అనంతపురంలోని మూడో రోడ్డుకు చెందిన యక్కలూరి సోమశేఖరరెడ్డి అలియాస్ శేఖరరెడ్డి న్యాయవాద వృత్తితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారమూ చేస్తున్నాడు. అనంతపురంలోని పాతూరుకు చెందిన టి.బాలకృష్ణ 1984లో ఎ.నారాయణపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 163లో వేసిన లేఔట్‌లో (ప్లాటు నంబర్ 107, 108) పది సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం 2018లో ఆయన బెంగళూరుకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న న్యాయవాది సోమశేఖరరెడ్డి ఆ ప్లాట్లను కాజేసేందుకు పథకం వేశాడు. ఇందులో భాగంగా రూ.6.50 లక్షలకు పది సెంట్ల స్థలాన్ని బాలకృష్ణ విక్రయించినట్లు ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్‌ను సృష్టించాడు. అందులో రెండు నెలల్లోపు రిజిస్టర్ చేయించి ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి రిజిస్టర్ చేయించుకుంటానని పొందుపరిచాడు. పథకం ప్రకారం రెండు నెలల పాటు వేచి ఉండి... తర్వాత విక్రయదారుడు తనకు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసివ్వడం లేదని, దీనిపై తనకు న్యాయం చేకూర్చాలంటూ బాలకృష్ణని ప్రతివాదిగా చేర్చి సివిల్ కోర్టులో దావా వేశాడు. ఇందులోనూ ప్రతివాది చిరునామా పాతూరు కాగా, న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టిస్తూ కోర్టు రోడ్డులోని ఓ బినామీ డోరు నంబర్‌ను పేర్కొన్నాడు. ఈ వ్యాజ్యాన్ని వాదనకు తీసుకున్న న్యాయస్థానం ప్రతివాదికి నోటీసు జారీ చేసింది. నోటీసు జారీ చేసినా ప్రతివాది కోర్టుకు హాజరు కాకపోవడంతో నిబంధన మేరకు ఓ ప్రముఖ దినపత్రికలో ఈ నెల 7న నోటీసు ప్రచురింపజేశాడు. నిర్ణీత గడువు రోజు వాయిదాకు హాజరు కాకపోతే కేసును ఎక్స్‌పార్టీ చేస్తూ తీర్పు వెలువడుతుందని పేర్కొన్నారు. ఈ నోటీసును గమనించిన బాలకృష్ణ బంధువులు విషయాన్ని వెంటనే అతనికి చేరవేశారు. దీంతో ఆగమేఘాలపై అనంతపురానికి వచ్చిన బాలకృష్ణ.. విషయం మొత్తాన్ని ఎస్పీ ఫక్కీరప్ప దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరాడు. దీనిపై విచారణ చేపట్టాలంటూ ఎస్పీ ఆదేశించడంతో డీఎస్పీ ప్రసాదరెడ్డి నేతృత్వంలో అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కరరెడ్డి దర్యాప్తు చేపట్టారు. తమదైన శైలిలో న్యాయవాది సోమశేఖరరెడ్డిని విచారణ చేయడంతో కుట్ర మొత్తం వెలుగు చూసింది. దీంతో మంగళవారం సోమశేఖరరెడ్డిని అరెస్ట్ చేసి, కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పథకాల పర్యవేక్షణతోనే సుస్థిరాభివృద్ధి

- మానవాళి అభివృద్ధిని చేసే అవకాశం రావడం అదృష్టం
- ఇతర ప్రాంతాలకు మార్గదర్శకమైన 'స్పందన'
- ప్రభుత్వ ప్రణాళిక కార్యదర్శి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రణాళిక కార్యదర్శి విజయ్‌కుమార్

రాప్తాడురూరల్: ప్రభుత్వ పథకాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించినప్పుడే సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ ప్రణాళిక కార్యదర్శి జి.విజయ్ కుమార్ తెలిపారు. మానవాళిని అభివృద్ధి చేసే అవకాశం రావడం మన అదృష్టమని ఉద్యోగులతో అన్నారు. మంగళవారం అనంతపురం నగర శివారు బళ్లారి రోడ్డు ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్పందన' కార్యక్రమంపై ఉమ్మడి అనంతపురం జిల్లాస్థాయి ఓరియెంటేషన్, సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలును ప్రతి స్థాయిలోనూ ఉద్యోగులు సరైన విధంగా పర్యవేక్షణ చేయగలిగితే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ సుస్థిరాభివృద్ధి సూచీలతో మ్యాపింగ్ చేశామన్నారు. 'నాడు-నేడు', 'విద్యా దీవెన' వంటి పథకాలతో నాణ్యమైన విద్యకు సంబంధించిన సూచీలు, 'సంపూర్ణ పోషణ'తో పసిపిల్లలు, గర్భిణులు ఆరోగ్య సూచీలు, 'క్లాప్'తో పరిసరాల పరిశుభ్రత సంబంధ సూచీలను మ్యాపింగ్ చేసినట్లు వివరించారు. ఉద్యోగులంతా తమ స్థాయిలో పథకాల అమలుపై బాధ్యతతో పర్యవేక్షణ చేయగలిగితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని దిశా నిర్దేశం చేశారు. సుస్థిర అభివృద్ధి అనేది ఒక ఉద్యోగి నిర్వర్తించే బాధ్యత మాత్రమే కాదని ఒక మనిషిగా ప్రతి వ్యక్తీ తీసుకోవాల్సిన బాధ్యత అని గుర్తు చేశారు. సుస్థిర అభివృద్ధి అంటే స్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధిస్తూనే పర్యావరణ పరిరక్షణ చేయడమని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం ఉద్యోగుల సహకారం వల్లే విజయవంతమైందన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం 'స్పందన' కార్యక్రమాన్ని అధ్యయనం చేసి తమ ప్రాంతాల్లో అమలు చేసేందుకు చొరవ చూపుతున్నాయన్నారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి ఉద్యోగులు పరిష్కారాలు చూపగలిగితే 'స్పందన' మరింత విజయవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల అడిషనల్ డైరెక్టర్ భావన వశిష్ట, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి అడిషనల్ కమిషనర్ మహేష్‌కుమార్, హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి, అనంతపురం ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, శ్రీసత్యసాయి కలెక్టర్ బసంత్‌కుమార్, అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, సీపీఓ ప్రేమ్‌చంద్, ఆర్డీఓ మధుసూదన్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధ్వజారోహణం


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

తాడిపత్రి టౌన్: బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు మంగళవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల నిర్వాహకుడైన చండీశ్వరున్ని ఆవాహన చేసి వస్త్రాలను సమర్పించి, కంకణధారణ చేయించారు. ఉత్సవాల్లో పాల్గొనే అర్చకులు, వేదపండితులు, భజంత్రీలు, సంబంధిత సిబ్బందికి దీక్షా వస్త్రాలను అందజేశారు. పుణ్యాహవాచనం, శివ సంకల్పం, చండీశ్వర పూజ, రుత్విగ్వరణం, అఖండ దీప స్థాపన, వాస్తుపూజ, హోమం, పంచావరణార్చన, కలశ స్థాపన తదితర ప్రత్యేక కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగాయి. అనంతరం చిత్ర గోపురంలో రాజరాజేశ్వరీదేవి, బుగ్గరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పాలిశెట్టి ఆంజనేయులు, సభ్యులు అంబటి రాఘవేంద్రారెడ్డి, హరిప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌స్వామి, రవిశర్మ, నందుశర్మ, గిరిశర్మ, శంకరశర్మ, శివమాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్

- రీజనల్ స్థాయిలో తలపడిన అనంత, వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జిల్లా జట్లు
- సీనియర్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తిరుపతి, కడప జట్లు



అనంతపురం, తిరుపతి జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, బంతిని బౌండరీ దాటిస్తున్న ప్రొద్దుటూరు బ్యాటర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. అనంతపురం జిల్లాతో పాటు వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించగా... అనంత క్రీడాగ్రామం వేదికగా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సీనియర్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) మధ్య జరిగిన తొలి మ్యాచ్‌ను 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన క్రీడాకారులకు ఇలాంటి వేదిక ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించేవారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. మానసిక, శారీరక వికాసంతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సులువుగా దక్కించుకోవచ్చునన్నారు. కృషి, పట్టుదల, అంకితభావం, సాధన ఉంటే ఎలాంటి క్రీడలోనైనా రాణించవచ్చునన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే క్రీడాకారుడికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా..

- అనంత క్రీడాగ్రామంలోని హాకీ క్రీడామైదానం వేదికగా జరిగిన సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. జట్టులో లేఖజ్ 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ శశాంక్ 14 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 29 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్లలో వినయ్ 3, భార్గవ్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు నిర్ణీత పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో భార్గవ్ 14 బంతుల్లో 2 సిక్సర్లతో 22 పరుగులు, వినయ్ 14 బంతుల్లో 1 సిక్సర్, 1 ఫోర్‌తో 19 పరుగులు చేసిన ఉపయోగం లేకుండా పోయింది. తిరుపతి బౌలర్ కార్తీక్ 1 వికెట్ సాధించాడు. 26 పరుగులతో తిరుపతి జట్టు విజయం సాధించింది.
- సీనియర్ విభాగంలో జరిగిన రెండో మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ప్రొద్దుటూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్లలో లోకేష్ 3, హరి 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 75 పరుగులకే పరిమితమైంది. జట్టులో జావీద్ 31 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. కడప బౌలర్లలో సాయి సుధీర్ 1 వికెట్ సాధించారు. 4 పరుగుల తేడాతో ప్రొద్దుటూరు జట్టు విజయం సాధించింది.

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP
SPL SAKSHI PREMIER LEAGUE

నేడు సీనియర్ విభాగంలో ఫైనల్స్

సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు – వైఎస్సార్ జిల్లా) మధ్య బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు.

జూనియర్ విభాగంలో చెలరేగిన తిరుపతి బ్యాటర్లు

జూనియర్ విభాగంలో అనంతపురం జిల్లా నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టుతో పాటు వైఎస్సార్ జిల్లా కడపలోని శ్రీసాయి ఐటీఐ కళాశాల, తిరుపతిలోని సీకామ్ జూనియర్ కళాశాల, నంద్యాలలోని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

- తొలి మ్యాచ్‌ను సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి), ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నంద్యాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. జట్టులో అనిల్ 21 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 28 పరుగులు సాధించాడు. తిరుపతి బౌలర్లలో ధనుష్, జబిన్ చెరో వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భరత్ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 29 పరుగులు సాధించాడు. నంద్యాల బౌలర్లలో గోవర్దన్ 1 వికెట్ కూలదోశాడు. 8 వికెట్లతో తిరుపతి జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి, ఫైనల్స్‌కు చేరుకుంది.
- బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల – ఆత్మకూరు (అనంతపురం), శ్రీసాయి ఐటీఐ కళాశాల – కడప (వైఎస్సార్) జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుతో తిరుపతి సీకాం జట్టు తలపడనుంది.


ఫైనల్స్‌కు చేరిన తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు.


ప్రొద్దుటూరు ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు.


జూనియర్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు

మహోన్నతుడు సేవాలాల్

- ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు
- బంజారాలతో కిటకిటలాడిన సేవాగఢ్
- ఇరుముడులు సమర్పించిన మాలధారులు


జయంత్యుత్సవాల్లో మాట్లాడుతున్న ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు


హాజరైన బంజారాలు


పాల్గొన్న ఎంపీ తలారి రంగయ్య, ప్రముఖులు

గుత్తి రూరల్: జల్ (నీర), జమీన్ (భూమి), జంగల్ (అడవి) నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ అని వక్తలు కొనియాడారు. ధర్మం, సమాజాభివృద్ధి, గో సంరక్షణకు పాటుపడిన సేవాలాల్ మార్గంలో బంజారాలు పయనించాలని పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి సేవాగఢ్‌లో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంత్యుత్సవాలను సేవాలాల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు ఘనంగా ప్రారంభించారు. బంజారాలు ముందుగా సేవాలాల్ మహారాజ్ ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం విగ్రహాన్ని ఆలయంలో కొలువుదీర్చారు. ట్రస్టు సభ్యులతో కలిసి అనంతపురం ఎంపీ తలారి రంగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. కర్ణాటక, తెలంగాణ నుంచి సేవాలాల్ మహారాజ్ మాలధారులు కాలినడకన సేవాగఢ్‌కు చేరుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడులు సమర్పించారు.

సేవాగఢ్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతాం

బంజారాల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న సేవాలాల్ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందని ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్ అన్నారు. సేవాగఢ్‌ను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే గిరిజన సంక్షేమ గురుకులం, జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. భవిష్యత్‌లో డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, వైద్య కళాశాలతో పాటుగా బంజారా యూనివర్సిటీ ఏర్పాటు విషయమై ప్రభుత్వాన్ని సంప్రదిస్తామన్నారు. ఆలయ ఆవరణలో టీటీడీ కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఉత్సవాలకు వచ్చిన బంజారాల సంప్రదాయ తలపాగా(పగిడి)లతో ప్రత్యేకంగా సన్మానించారు. బంజారాలు చెడు వ్యసనాలు వీడి దైవారాధన, సేవా కార్యక్రమాలతో సన్మార్గంలో పయనించి జన్మ సార్థకం చేసుకోవాలని మహంత్ శ్రీ చేతన్ గిరి మహారాజ్ అన్నారు. బంజారాలు విద్యావంతులై ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ సహకారం ఎనలేనిది

బంజారాల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎనలేనిదని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. 500 జనాభా కలిగిన గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసి బంజారాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి గిరిజన కుటుంబానికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు.

స్టాళ్ల ఏర్పాటు

సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవం సందర్భంగా ఆలయ పరిసరాల్లో సమాచార ప్రసార శాఖ ప్రదర్శన శాల, గిరిజన హక్కుల ఛాయాచిత్రాల ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేశారు. బంజారాలు తిలకించారు. ఉత్సవాల సందర్భంగా బేతాపల్లి పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బంజారాల వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్, సభ్యులు శేఖర్‌నాయక్, హరిలాల్ నాయక్, ఠాగూర్ నాయక్, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు పాల్గొన్నారు. డీఎస్పీ నరసింగప్ప, గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 250 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక దృష్టి

- మునిసిపాలిటీలు, మండలాల వారీగా ఎంసీసీ కమిటీల నియామకం
- పకడ్బందీ అమలుకు ఫ్లయింగ్ స్క్వాడ్స్
- ఉత్తర్వులు జారీ చేసిన ఎన్నికల అధికారి

నియోజకవర్గాల వారీగా ఫ్లయింగ్ స్క్వాడ్

నియోజకవర్గం	టీమ్ హెడ్	పోలీసు అధికారి
అనంతపురం	శ్రీనివాసరెడ్డి, మండల పీఆర్ ఇంజనీర్	ఏఎస్‌ఐ నారాయణనాయక్
రాప్తాడు	సత్యబాబు, ఈఓఆర్‌డీ, ఆత్మకూరు	హెచ్‌సీ నవీద్‌బాషా
శింగనమల	వరప్రసాద్, మండల పీఆర్ ఇంజనీర్	ఏఎస్‌ఐ చితంబరయ్య
తాడిపత్రి	జిలానీబాషా	హెచ్‌సీ శివయ్య
గుంతకల్లు	ఓబులేసు, మండల పీఆర్ ఇంజనీర్	పీసీ నాగరాజు
ఉరవకొండ	దామోదరరెడ్డి, ఈఓఆర్‌డీ	పీసీ సత్యనారాయణ
కళ్యాణదుర్గం	సురేష్, మునిసిపల్ డీఈఈ	హెచ్‌సీ చెన్నకేశవులు
రాయదుర్గం	గోపీనాథ్, ఏఈఈ	పీసీ రఘుబాబు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల క్రమంలో ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మునిసిపాలిటీలు, మండలాల వారీగా ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) బృందాలను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఈ నెల 13న ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపాలిటీల్లో ఎంసీసీ బృందానికి అధిపతిగా అక్కడి కమిషనర్ వ్యవహరిస్తారు. అలాగే మునిసిపాలిటీ పరిధిలోని పోలీసు స్టేషన్ నుంచి ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారులనూ నియమించారు. మండలాల్లో ఎంసీసీ బృందం అధిపతిగా ఎంపీడీఓ వ్యవహరిస్తారు. మండల పరిధిలోని పోలీసు స్టేషన్ నుంచి ఎస్‌ఐ స్థాయి మొదలు పోలీసు కానిస్టేబుల్ స్థాయి అధికారులను సభ్యులుగా నియమించారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు పరిచేలా పర్యవేక్షణ చేసేందుకు నియోజకవర్గాల వారీగా ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ వెంట వీడియోగ్రాఫర్ ఉంటారు. ఎక్కడైనా నియమావళి ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే వెంటనే వీడియో ద్వారా చిత్రీకరించి ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తారు.

నరేంద్రరెడ్డిపై చర్యలు తీసుకోండి

- డీఎస్పీ చైతన్యకు ఏఎన్‌ఎంల ఫిర్యాదు

యాడికి: తాము దుస్తులు మార్చుకుంటుండగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించే ప్రయత్నం చేసిన రాయలచెరువు పీహెచ్‌సీ స్వీపర్ నరేంద్రరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాడిపత్రి డీఎస్పీ చైతన్యకు పలువురు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వివరాలను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల సమావేశంలో రాయలచెరువు సచివాలయ ఏఎన్‌ఎంలు వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ నెల 7న రాయలచెరువు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఓ గదిలో దుస్తులు మార్చుకుంటుండగా స్వీపర్ నరేంద్రరెడ్డి తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించే ప్రయత్నం చేశాడని వివరించారు. విచారణలో ఇదే విషయాన్ని నరేంద్రరెడ్డి అంగీకరించినా.. ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వాపోయారు. దీంతో మంగళవారం డీఎస్పీని కలసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే అంశంపై వైద్యాధికారి అప్పయ్య మాట్లాడుతూ.. జరిగిన మొత్తం విషయాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'అప్పర్ భద్ర'తో ముప్పు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంతకల్లు: కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే రాయలసీమ జిల్లాలు ఎడారిగా మారుతాయని సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గుంతకల్లుకు వచ్చిన ఆయన.. స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం కనబరిచిందని మండిపడ్డారు. అదే కర్ణాటకలో త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించడంతో పాటు ఆగమేఘాలపై రూ.5,300 కోట్ల నిధులు మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ జిల్లాలకు వరదాయినిగా ఉన్న తుంగభద్ర డ్యాంకు నీటి లభ్యత తగ్గుతుందన్నారు. ఈ క్రమంలో టీబీ డ్యాం దిగువన ఉన్న ప్రాజెక్టుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. వెంటనే ప్రాజెక్టు పనులు అడ్డుకోకపోతే భవిష్యత్తులో రాయలసీమ ఎడారిగా మారుతుందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, ఓబులేసు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

గుత్తి: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు గుత్తి సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు. వివరాలు... గుంతకల్లు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌కు నాలుగేళ్ల క్రితం గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామానికి చెందిన అంబికతో వివాహమైంది. పెళ్లి సమయంలో కొంత డబ్బు, బంగారు కట్నంగా ఇచ్చారు. మూడేళ్లు అన్యోన్యంగా వీరి కాపురం సాగింది. ఈ క్రమంలో గత ఏడాది నుంచి అదనపు కట్నం కోసం ప్రదీప్‌కుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు వరాలమ్మ, ఆంజనేయులు వేధించసాగారు. పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పినా పరిస్థితిలో మార్పు రాలేదు. పైగా వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో అంబిక పుట్టింటికి చేరుకుని సోమవారం గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ అనంతరం ప్రదీప్‌కుమార్, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


లాల్‌స్వామి (ఫైల్)

గుంతకల్లు రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం అమీన్‌పల్లికి చెందిన లాల్‌స్వామి (37), రామాంజినమ్మ దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు కుటుంబంతో కలసి వలస వెళ్లిన లాల్‌స్వామి.. అక్కడ జీహెచ్‌ఎంసీలో చెత్త సేకరిస్తూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. మూడు రోజుల క్రితం పెద్ద కదిరప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన సామూహిక వివాహ వేడుకల్లో తన అన్న రామాంజనేయులు కుమార్తె పెళ్లి జరిగింది. ఈ వేడుకకు వారం రోజుల క్రితం భార్యాపిల్లలతో కలసి స్వగ్రామానికి లాల్‌స్వామి వచ్చాడు. పెళ్లికి వచ్చిన చుట్టాలతో కలసి మంగళవారం ఉదయం దుస్తులు ఉతికేందుకు గ్రామ శివారులో ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో లాల్‌స్వామి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువు నీటిలో పడిపోయాడు. అక్కడే ఉన్న మహిళలు కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు చెరువులో దూకి లాల్‌స్వామిని వెలికితీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న లాల్‌స్వామిని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన పీఆర్ ఏసీ

పామిడి: మండలంలోని రామరాజుపల్లి గ్రామ సచివాలయాన్ని పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ రమేష్‌బాబు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిపై సిబ్బందితో సమీక్షించారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద చేపట్టిన రీసర్వేపై ఆరా తీశారు. అనంతరం సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, డీపీఓ ప్రభాకరరావు, డీఎల్‌పీఓ దామోదరరెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శశికళ, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కారం



జేసీబీతో పనులు చేయిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: ఆజాద్‌నగర్‌లో మురుగు సమస్యను డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి పరిష్కరించారు. మంగళవారం నడిమివంక వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా, మురుగంతా ఆజాద్‌నగర్‌లోని ఇళ్ల ముందుకు వెళ్లింది. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. జేసీబీతో మురుగునీరు నడిమివంకలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ మంగళవారం తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న సర్వజనాస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రామస్వామి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలోని త్వరిత చికిత్స కేంద్రం (డీఈఐసీ)లో కిమ్స్ సవీరా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, చిన్నపిల్లల విభాగం వైద్యాధికారిని డాక్టర్ సుహాసిని, డీఈఐసీ వైద్యాధికారి డాక్టర్ నారాయణస్వామి, ఆర్ఎంఓ వైవీ రావు, కిమ్స్ సవీరా ఆస్పత్రి కార్డియాలజీ వైద్యులు డాక్టర్ లింగస్వామిలు హాజరయ్యారు. వైద్య శిబిరంలో 118 మంది చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అందులో 14 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవప్ప, డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రాప్తాడురూరల్: ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన యువతి ఎనుమల శిల్ప సోదరి ఇంటికి వెళ్తున్నానని చెప్పి అదృశ్యమైంది. మంగళవారం ఈ మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఎనుమల లక్ష్మీ సోదరి సాయిలక్ష్మి అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లో నివాసం ఉంటోంది. సోదరి ఇంటికి వచ్చిన శిల్ప ..సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోనుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోయేసరికి ఆందోళనకు గురైన అక్క, బంధువులు తెలిసిన చోటల్లా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ యువత ఆచూకీ తెలిస్తే సీఐ సెల్: 94407 96811, ఎస్ఐలు సెల్: 93469 17101, 93469 17102 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ విజయభాస్కర్‌గౌడ్ కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



డీఈఓ సాయిరాంను సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ ప్రతినిధులు

అనంతపురం సిటీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వైఎస్సార్‌టీఎఫ్ ప్రతినిధులు డీఈఓ సాయిరాంను కోరారు. ఈ మేరకు యూనియన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబుళపతి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు డీఈఓను మంగళవారం కలిశారు. నూతన డీఈఓకు పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి అందించారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించారు. డీఈఓను కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ హుస్సేన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

కాసుల కోసం కర్ర పెత్తనం

- సెబ్ అధికారుల దాడుల వెనుక దందా
- ప్రముఖుల హోటళ్లు, ధాబాల్లో మద్యం అనుమతి
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) పోలీసులకు కాసుల పంట పండుతోంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్న నిషేధం అమలులో ఉండడం వీరికి వరంగా మారింది. దాడుల పేరుతో దందా సాగిస్తున్నారు. నగరం, నగర శివారు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బడా బాబుల హోటళ్లు, ధాబాల్లో బహిరంగంగా మద్యం తాగేందుకు అనుమతి ఇస్తూ, దాడులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దినసరి కూలీలు, చిరువ్యాపారులు, కార్మికులు పనులు ముగించుకొని ఇళ్లకెళ్లే సమయంలో మద్యం తాగుతూ పట్టుబడితే కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో యథేచ్ఛగా వీరి దందా సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి.

ఇదీ సెబ్ పోలీసుల సంగతి

ఇటీవల బళ్లారి బైపాస్ పక్కన ఓ భోజన హోటల్‌లో పనిచేసే కార్మికుడికి ఇంటికెళ్లే ముందు మద్యం సేవించడం అలవాటు. మద్యం తెప్పించుకొని తాగుతుండగా సెబ్ పోలీసులు సోదాల పేరుతో హోటల్‌పై దాడిచేశారు. ఆ సమయంలో మద్యం తాగుతున్న హోటల్ కార్మికుడిని పట్టుకున్నారు. అయ్యా.. హోటల్‌లో పనిచేసి, ఇంటికెళ్లే సమయంలో మద్యం తాగి వెళ్తానని ఎంత చెప్పినా పోలీసులు వినలేదు. చివరికి గుల్జార్‌పేటలోని సెబ్ స్టేషన్‌కు వచ్చి కలవాలని సూచించారు. చేసేదిలేక అతను మరుసటి రోజు సెబ్ స్టేషన్‌కు వెళ్లాడు. ఇక నుంచి ఎప్పుడు పిలిచినా స్టేషన్‌కు రావాలని హెచ్చరించి పంపారు. రెండురోజులు గడిచిన తర్వాత అదే హోటల్‌కు వెళ్లిన పోలీసులు.. యజమానిని పిలిచి కేసు రాయాలా? ..లేక బండికి డీజిల్ కొట్టిస్తావా అంటూ అతన్ని ఇరకాటంలో పెట్టారు. దీంతో ఆందోళన చెందిన హోటల్ యజమాని విధి లేక పోలీసులకు రూ.6 వేలు ముట్టజెప్పాడు. ఈ ఘటన ఒకటే కాదు.. సెబ్ పోలీసులు చాలాచోట్ల వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు.

విచ్చలవిడిగా అనధికారిక అనుమతులు

నగరంలో సెబ్ పోలీసులు ఎటు చూసినా మద్యం తాగేందుకు అనధికారిక అనుమతులు ఇచ్చారు. ప్రతి హోటల్ నుంచి రూ. 5వేల నుంచి రూ.10వేల మధ్య మామూలు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. నగరంలో హోటల్ సంగతి అలా ఉంచితే శివారు ప్రాంతాల్లో భారీగా మద్యం సేవించేందుకు ప్రత్యేక గదులు కేటాయించారు. ఉన్నత వర్గాలకు చెందిన వారు ఈ హోటళ్లలో అర్ధరాతి దాకా పూటుగా మద్యం సేవించి, తాపీగా ఇళ్లకు చేరుతున్నారు. హోటళ్ల యజమానులు రూ.వేలు మామూలు ముట్ట చెబుతుండటంతో సెబ్ పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు.

పోలీస్‌శాఖ పెద్దలే హోటళ్ల నిర్వహణ :

నగర శివారుల్లోని అధునాతన హోటళ్లలో ప్రత్యేక గదులు, ఇంపోర్టెడ్ మద్యం దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు పోలీసుశాఖ పెద్దలు కూడా ఇక్కడ హోటళ్లు నిర్వహిస్తుండటంతో సెబ్ పోలీసులు కూడా అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు ఉన్నాయి. బెంగళూరు నుంచి రాత్రి సమయాల్లో ఈ హోటళ్లకు మద్యం కూడా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. కస్టమర్ల ఆర్డర్‌పై ఈ మద్యాన్ని అక్కడి నుంచి తెస్తున్నట్లు సమాచారం.

వేడుకల మాటున వ్యభిచారం

జాతీయ రహదారి 44కు ఇరువైపులా ఉన్న కొన్ని హోటళ్లలో జన్మదిన వేడుకల రోజు, వివాహ వేడుకలకు ప్రత్యేకంగా మినీ ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు హాజరయ్యే వారి కోసం నిర్వాహకులు కొందరు దిగజారి వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వ్యభిచారం కూడా జోరుగా సాగుతున్నట్లు తెలిసింది. అద్దె పేరుతో గదులు ఇచ్చి, అందులో మద్యం తాగేందుకు, బస చేసేందుకు కూడా అనుమతి ఇస్తున్నారని సమాచారం. కాగా ఇటువైపు పోలీసులుగాని, సెబ్ పోలీసులుగాని కన్నెత్తి చూడకపోవడంతో మద్యంతో పాటు ఇతర కార్యకలాపాలు జోరుగా సాగుతున్నట్లు తెలిసింది. సెబ్ పోలీసులు వసూళ్ల పర్వంపై సీఐ రవీంద్రను అడగ్గా ఆయన ఇలా స్పందించారు. మద్యం తాగినందుకు అనుమతించలేదని కొందరు ఇలా తమ శాఖపై చెప్తున్నారని చెప్పుకొచ్చారు.

సమాజ సేవలో ముందుండాలి



ఎన్ఎస్ఎస్‌లో చేరిన మెడికల్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విద్యతో పాటు సామాజిక సేవలోనూ విద్యార్థులు ముందుండాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ తెలిపారు.మంగళవారం స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2022 మెడికల్ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు తెలిపారు. 82 మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం నియోజకవర్గ పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల అవగాహన సదస్సును స్థానిక తపోవనం సర్కిల్‌లోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరెడ్డి యాదవ్, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

అమర వీరుల కుటుంబాలకు అండగా ఉంటాం



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెప్టెన్ షేకన్న అన్నారు. మంగళవారం హెచ్ఎల్‌సీ కాలనీలోని సంఘం కార్యాలయంలో అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు. ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి ,బషీర్ అహ్మద్, శివశంకర్, నబీరసూల్, రంగారెడ్డి, హుస్సేన్, ఆర్ఎస్ నాగరాజు, నరసింహులు, వై.ప్రసాద్, మొయినుద్దీన్, రవికుమార్, బాల నాగరాజు, అన్వర్ బాషా, మణి కుమార్, బాలస్వామి, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, ఇర్షాద్ అహ్మద్ పాల్గొన్నారు.

అనంతపురం: అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవానులకు ఘన నివాళి అర్పించారు. దేశ శ్రేయస్సుకు పరితపించే వీర జవాన్లకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్ రెడ్డి అన్నారు. విదేశీ సంస్కృతిని విడనాడి దేశీయ సంస్కృతిని అలవర్చుకోవాలని కోరారు. ఏబీవీపీ నగర కార్యదర్శి శివతేజ, నగర ఉపాధ్యక్షుడు భరత్ కమలాకర్, సంతోష్, హర్ష, బాలాజీ, నితిన్ పాల్గొన్నారు.

19న రాతిదూలం పోటీలు

ఆత్మకూరు: బి.యాలేరులో ఈ నెల 19న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి బ్రదర్స్ ఆర్థిక సహకారంతో (జనరల్) రాతిదూలం లాగుడు పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.5 వేలు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా అందిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్: 9704669387, 9502566210లో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు: వేపచెర్ల దిగువ తండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ప్రజలు మంగళవారం సన్మానించారు. వేపచెర్ల దిగువతండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, హుసేన్‌పీరా, గంగిరెడ్డి, చంద్రమోహన్ ఉద్యోగోన్నతి పొందారు. సర్పంచ్ రమాదేవి, కృష్ణానాయక్, హెచ్ఎం వెంకట్ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆలూరు సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ విద్య సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మారుతీనాయుడు, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం తపోవనం సర్కిల్‌లో ఉన్న రాకేష్ వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైపుల్లా బేగ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికిరణ్‌రెడ్డి, దినేష్ రెడ్డి, నితిన్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



చైర్‌పర్సన్ ఎం.లిఖితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీసీసీబీ అధికారులు, ఉద్యోగులు

డీసీసీబీ చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖితకు జన్మదినం సందర్భంగా మంగళవారం బ్యాంకర్లు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సహకార కుటుంబ సభ్యులుగా కలిసికట్టుగా పనిచేసి, ఈ ఏడాది బ్యాంకు వ్యాపార లావాదేవీలను రూ.2 వేల కోట్లకు చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో ఏబీ రామ్ ప్రసాద్, జీఎం కె.సరేఖారాణి, డీజీఎం డి.సుఖదేవ బాబు, ఆప్కాబ్ అధికారి దినేష్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి అండగా నిలిచిన ‘అమ్మ’

అనంతపురం కల్చరల్: నగరంలోని నాయక్‌నగర్‌కు చెందిన రఫీకి ‘అమ్మ’ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. రఫీ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. రోడ్డు ప్రమాదంలో తల్లి కూడా మృతి చెందింది. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న రఫీకి ఓ ప్రమాదంలో పెద్ద గాయమై, కాలు తీసేశారు. గాయం మానేంత వరకూ మంచాన ఉండాల్సిన పరిస్థితి. దీనికి తోడు ఐదోతరగతి చదువుతున్న నూర్జహాన్, రెండోతరగతి చదువుతున్న షహిదా కూడా రఫీపైనే ఆధారపడ్డారు. ప్రమాదం జరగకముందు పెయింటింగ్ పనులు చేసుకొని కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. జీవనాధారం లేక, కుటుంబ పోషణ భారమై అష్టకష్టాలు పడుతున్న రఫీ కుటుంబాన్ని అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి స్పందించి రూ.40వేలు విలువజేసే కృత్రిమ కాలు అందించాడు. ఆటో కూడా కొనిచ్చి జీవనోపాధి కల్పిస్తామని అమ్మ సంస్థ అధ్యక్షుడు బాధితుడికి భరోసా ఇచ్చారు.



రఫీకి కృత్రిమ కాలు అందిస్తున్న అమ్మ సంస్థ రమణారెడ్డి

● బైక్‌లపై హల్‌సెల్

సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ మొబైల్ వాడకం మితిమీరిపోయింది. ప్రతి ఇంటా నగటున కనీసం రెండు,మూడు మొబైళ్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలేకాదు.. వ్యక్తిగత పనులనో.. వృత్తిగత పనులనో.. ప్రతి ఒక్కరూ ఉరుకుల పరుగుల జీవితం గడుపుతున్నారు. నిమిషం ఆలస్యమైనా నష్టపోతామన్నట్లు బైక్‌ల్లోనూ, కార్లల్లోనూ హల్ 'సెల్' చేస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ మేలుకొని మొబైల్ వాడకం తగ్గించాలని, సురక్షిత ప్రయాణం సాగించాలని ప్రభుత్వం ఓ వైపు తెలియజేస్తోంది. మరో వైపు పోలీస్ అధికారులు కూడా జరిమానాల రూపంలో హెచ్చరిస్తూనే ఉన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రోడ్డు మధ్యలో బైక్ ఆపి ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యం



సింగిల్ హ్యాండ్‌తో బైక్ నడుపుతున్న వాహనదారుడు



అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనదారులు



సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యం

ఫీజు వసూళ్ల లక్ష్యం వంద శాతం సాధించాలి



ఏడీ, సెక్రటరీలతో సమావేశమైన మార్కెటింగ్‌శాఖ ఆర్‌డీడీ లావణ్య

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ ఫీజు లక్ష్యం వందశాతం నెరవేరాలని సంబంధిత ఉద్యోగులను ఆ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్‌డీడీ) లావణ్య ఆదేశించారు. జిల్లాకు వచ్చిన డీడీ మంగళవారం స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఏడీ పి.సత్యనారాయణచౌదరితో కలసి 9 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో ఫీజుల వసూళ్లపై సమీక్షించారు. ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ కమిటీల ద్వారా రూ.10.44 కోట్లు ఫీజు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతానికి 80 శాతం పూర్తయిందన్నారు. శింగనమల, రాప్తాడు కమిటీలు ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించగా... అనంతపురం, తాడిపత్రి, రాయదుర్గం వంద శాతానికి చేరువలో ఉన్నాయన్నారు. గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, ఉరవకొండ మార్కెట్ కమిటీల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ, పత్తి, మిరప లాంటి పంట దిగుబడులు, క్రయ విక్రయాలు, రవాణా తగ్గడం, సిబ్బంది కొరత లాంటి కారణాలతో వసూళ్లు బాగా తగ్గినట్లు తెలిపారు. అనంతరం ఆడిటింగ్, గోదాముల నిర్మాణం, వినియోగం తదితర అంశాలపై చర్చించారు.

హంస వాహనంపై కైలాసవాసుడు

అనంతపురం కల్చరల్: నగరంలో జరిగిన కైలాసవాసుడి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజలు మహాన్యాసం, ఏకవార రుద్రాభిషేకం, దీక్షాహోమం వరకు సాగాయి. రాత్రి ప్రదోష కాల పూజల తర్వాత విద్యుత్‌దీప కాంతుల మధ్య వాహన సేవలు సాగాయి. మొదటిరోడ్డు నుంచి రెండో రోడ్డు, మూడోరోడ్డు మీదుగా ఆలయం చేరుకున్న నగరోత్సవంలో స్వచ్ఛతకు ప్రతిరూపమైన హంసతూలికా వాహనంపై స్వామి నగర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోలాటం, వివిధ కళారూపాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. భజన సంఘాల వారి ఆదిదేవుడి నామ స్మరణ, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల హోరు, శివనామస్మరణతో సాగిన సాంస్కృతిక సంబరాలు భక్తిభావాన్ని నింపాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధారాణి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హంసవాహనంపై ఊరేగుతున్న కాశీవిశ్వేశ్వరుడు

త్రిమూర్తి శివజయంత్యుత్సవాలు

ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు త్రిమూర్తి శివజయంత్యుత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు సిస్టర్ శారదా అన్నారు. ఈ మేరకు మంగళవారం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 16న పాతూరు బ్రహ్మకుమారీ సేవా కేంద్రంలో యువత కోసం యువజాగృతి సదస్సు జరుగుతుందన్నారు. 17న స్థానిక పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో మహిళాస్వశక్తి కరణ అనే అంశంపై ఉపన్యాసం, లక్ష దీపోత్సవం జరుగుతాయన్నారు. 18న మహాశివరాత్రి సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం, 10 అడుగుల మహాశివుడి లింగ ప్రదర్శన, సంస్కార భారతి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కార్తికేయుడికి విశేష పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు కవచంతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి పూజలు చేశారు.